# ప్రజాశక్తి

ఆదివారం 19 జనవరి 2025

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

### ప్రజా సమస్యలపై..

# అంకితభావంతో పనిచేయండి



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

- జెడ్‌పి సమావేశంలో చైర్‌పర్సన్ సుభద్ర
- బల్క్ డ్రగ్ పార్కు రద్దుకు సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు పట్టు
- సామాజిక పింఛనుదారులపై కక్ష సాధింపు తగదు : గొలుగొండ జెడ్‌పిటిసి గిరిబాబు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ప్రజా సమస్యలపై అంకిత భావంతో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలతో పాటు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ పనులు, ఆర్థిక ప్రణాళికలు, తదితర అంశాలపై చర్చ సాగింది. ప్రజలకు, పర్యావరణానికి హాని చేసే బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయడంపై సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ప్రశ్నించారు. తక్షణమే ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. సామాజిక పింఛన్ల తనిఖీలపై గొలుగొండ జెడ్‌పిటిసి గిరిబాబు ప్రశ్నలు లేవనెత్తారు.

తొలుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్, వ్యయాలను సభ్యుల ఆమోదం కోసం ఈ సమావేశంలో ప్రవేశపెట్టారు. జిల్లా పరిషత్‌కు సంబంధించి భవనాలు, అతిథి గృహాలు, షాప్‌లు, స్థలాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే విషయమై సూచనలు, సలహాలు సభ్యుల నుంచి కోరారు. ఇతర రాష్ట్రాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు సభ్యులను తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తామని చైర్‌పర్సన్ తెలిపారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో జిల్లా పరిషత్‌నకు సంబంధించి 19 అతిథి గృహాలు ఉన్నాయని, వాటిలో కొన్నింటికి మరమ్మతులు చేయించి, మరలా వినియోగంలోకి తీసుకొనివస్తామని అన్నారు. మెయింటినెన్స్‌లో ఇబ్బందులు లేకుండా నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆదాయ వనరులు పెంచుకునేలా, సంస్థ మిగతా 2లో..



బల్క్ డ్రగ్ పార్కుపై ప్రశ్నిస్తున్న సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

### 'ఉక్కు'కు ప్యాకేజీ
## శాశ్వత పరిష్కారం కాదు
### - ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** కేంద్ర ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ప్రకటించిన రూ.11440 కోట్ల ప్యాకేజీ ప్రస్తుతం కర్మాగారం ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కాజాలదని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ నేడు రెండు ప్రధాన సమస్యలను ఎదుర్కొంటోందని తెలిపారు. అందులో ఒకటి 2021 జనవరిలో కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను స్ట్రాటజిక్ సేల్ పేరున అమ్మేయాలని నిర్ణయించిందని తెలిపారు. దాన్ని నేటికీ ఉపసంహరించుకోలేదని పేర్కొన్నారు. రెండోది స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడం వల్ల ఏడాదికి సాలినా రూ.18 వేల కోట్లను కేవలం ఇనుప ఖనిజానికే ఖర్చు పెట్టవలసి వస్తోందని గుర్తుచేశారు. మిగిలిన స్టీల్‌ప్లాంట్‌లతో పోలిస్తే సుమారు మూడు వేల రూపాయల వరకు అదనంగా ఒక్కో టన్నుకు దీనివల్ల ఖర్చవుతోందని వెల్లడించారు. విచిత్రంగా నేడు కేంద్ర ప్రభుత్వం ఆ రెండింటినీ ప్రస్తావించకుండా స్టీల్‌ప్లాంట్ సమస్య పరిష్కారమైందని తెలపడం సమ్మతం కాదన్నారు. అందువల్ల ఈ ప్యాకేజీకి తోడు ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని తెలపడం, సెయిల్‌లో కలపడం లేదా సొంత గనులు కేటాయించడం చేయాలని డిమాండ్ చేశారు.

## కార్మికులపై వేధింపులు తగవు
వార్త 4లో..

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
వార్త 6లో..

## ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి
వార్త 7లో..



జ్యోతి ప్రజ్వలన చేసి కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న జస్టిస్ నరసింహ, చిత్రంలో ధీరజ్ సింగ్ ఠాకూర్

## సకాలంలో న్యాయ సేవలే ప్రథమ కర్తవ్యం

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ వార్త మెయిన్‌లో..

## అవినీతి నియంత్రణకు చర్యలు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ప్రభుత్వ శాఖల్లో జరిగిన అవినీతి నియంత్రణ చర్యలపై రాజీ పడకుండా ప్రభుత్వానికి నివేదికలను సమర్పిస్తామని ఎపి ప్రభుత్వ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డిగా బాధ్యతలు స్వీకరించిన కింజరాపు ప్రభాకర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా శనివారం ఆయన విశాఖపట్నం ప్రాంతీయ నిఘా, అమలు శాఖలో ఓఎస్‌డిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వానికి సంబంధించిన ఏ శాఖలోనైనా అవకతవకలు జరిగినా, ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులు చెల్లించక పోయినా, ప్రభుత్వ ధనాన్ని వృథా చేసినా, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు కాకపోయినా విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరాల్సి ఉందన్నారు.



మొహియుద్దిన్‌కు పురస్కారం అందజేస్తున్న అతిథులు

## అందెశ్రీ, ఖాదర్ మొహియుద్దిన్‌లకు లోక్‌నాయక్ పురస్కారాలు ప్రదానం

వార్త మెయిన్‌లో..

## మొదటి పేజీ తరువాయి..

### అంకితభావంతో పనిచేయండి

ఆస్తులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు వచ్చేలా సభ్యులు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా ఆదాయం రూ.1589,13,81,635కు, అంచనా వ్యయం రూ.1586,08,58,235కు సంబంధించి సభ్యులు ఆమోదం తెలిపారు.

### బల్క్‌డ్రగ్ పార్కుతో నష్టం : గంగరాజు

అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్కుతో ప్రజలకు తీవ్ర నష్టమని, దీన్ని తక్షణమే రద్దు చేయాలని సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్కు రద్దుకు జెడ్‌పి సమావేశంలో తీర్మానం చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించాలన్నారు. బల్క్ డ్రగ్ పార్కుతో నక్కపల్లి మండలంలో రాజయ్య పేట, వేంపాడు, బుచ్చిరాజుపేట, చందనాడ, డిఎల్.పురంల్లో 2001 ఎకరాల్లో పంటలకు నష్టం కలగడమే కాకుండా రైతులు శాశ్వతంగా తమ ఉపాధిని కోల్పోతారని అన్నారు. గతంలో దాదాపు 120 ఎకరాల విస్తీర్ణంలో హెటిరో డ్రగ్ కంపెనీ ఏర్పాటుతో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతిందని సమావేశం దృష్టికి తెచ్చారు. హెటిరో వాయు కాలుష్యంతో పంటలు దెబ్బతిన్నాయని, పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. అక్కడి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవన్నారు. ఇప్పుడు మరలా నక్కపల్లి మండలంలో 2001 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారన్నారు. రాజ్యాంగపరమైన ఆమోదం పొందకుండా, పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల ఆమోదాలు లేకుండా బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు తగదన్నారు. ఆ పార్కుతో తలెత్తే పరిణామాలను వివరించారు. మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతారన్నారు. భూగర్భ జలాలు, చెరువులు కలుషితమై పంటలు పండక రైతులు నష్టపోతారన్నారు. వాయు కాలుష్యంతో ప్రజలు అవస్థలపాలవుతారన్నారు. బల్క్ డ్రగ్ పార్కు రద్దుకు పార్టీలకు అతీతంగా కలిసి పోరాడాలని కోరారు. ఈ క్రమంలో నక్కపల్లి జెడ్‌పిటిసి గోసాల కాసులమ్మతో కలిసి ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం సమర్పించారు.

### పొరపాట్లు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

సామాజిక పింఛన్ల పట్ల ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టడం ఎంత వరకూ సమంజసమని గొలుగొండ జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు ప్రశ్నించారు. పింఛన్ల పంపిణీ విషయంలో గత ప్రభుత్వంలో అధికారులు సిక్స్ పెస్ట్ వెరిఫికేషన్ చేసిన తర్వాతే అర్హులకు మంజూరు చేసేవారని, అటువంటప్పుడు పింఛన్ల మంజూరులో పొరపాటు జరిగిందంటే.. అది అధికారుల నిర్లక్ష్యం అవుతుంది తప్ప లబ్ధిదారులు తప్పు చేసినట్లు ఎలా అవుతుందని అడిగారు. మండలాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఆస్తుల వివరాలను ఆయా జెడ్‌పిటిసిలకు నివేదిక రూపంలో అందజేయాలని కోరారు. సమావేశంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, కొప్పల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పివిజి.కుమార్, పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవంలో కమిషనర్ సంపత్ కుమార్

### అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన..
## స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** జన క్రాంతి ట్రస్ట్ సహకారంతో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను శనివారం జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఉన్న యువత కంప్యూటర్ నైపుణ్యత పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇటువంటి స్వచ్ఛంద సంస్థల నిర్వహణలో నడిచే శిక్షణ తరగతుల్లో శిక్షణ పొందడం వల్ల నైపుణ్యతతో పాటుగా బయట పోటీ ప్రపంచానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానం పరిపూర్ణంగా అందుతుందని తెలిపారు. నగరంలో ఉన్న యువత అందరూ ఈ సెంటర్‌ను వినియోగించుకోవాలని కోరారు. పోటీ ప్రపంచంలో వచ్చే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులకు కావలసిన కంప్యూటర్లను రూ.10 లక్షల వ్యయంతో జన క్రాంతి ట్రస్ట్ ఛైర్మన్ ప్రొఫెసర్ శివప్రసాద్ అందించారని చెబుతూ అందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకులు ఎల్లాజీ మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణలో భాగంగా నేటి యువతరానికి అవసరమైనటువంటి ఫండమెంటల్స్ ఆఫ్ కంప్యూటర్స్, వెబ్ టెక్నాలజీ, ఐటి కోర్సులు, అకౌంటింగ్, మల్టీ మీడియా, సోషల్ మీడియాకు సంబంధించినటువంటి కోర్సులను నామమాత్రపు రుసుముకు అందిస్తామన్నారు. రోజుకు నాలుగు షిఫ్ట్‌లు ఉంటాయన్నారు. ప్రస్తుతం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ ఒక బ్యాచ్‌కు, సాయంత్రం 5:30 గంటల నుంచి 7:30 వరకు మరో బ్యాచ్‌కు కంప్యూటర్ నిపుణులచే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కంప్యూటర్ శిక్షణకు ఎటువంటి వయో పరిమితీ లేదని, కంప్యూటర్ నేర్చుకోవాలనే కుతూహలం ఉంటే చాలని తెలిపారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ బాధ్యులు జిఎస్.రాజేశ్వరరావు, దండు నాగేశ్వరరావు, టి.కామేశ్వరరావు, ఎంఆర్‌డి.రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

# ప్యాకేజీ 'ఉక్కు' ఊపిరి నిలుపుతుందా ?

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

'తాంబూళాలిచ్చాం...తన్నుకు చావండి'... మా బాధ్యత ఇంకేమీ లేదు.. అన్న చందాన కూటమి పాలకులు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలో తాజాగా మాటలు వల్లెవేస్తున్నారు. అంటే చేయాల్సిందంతా చేసేశాం. తమ బాధ్యత అయిపోయింది.. అన్నదే వారి మాటల సారాంశం. వాస్తవానికి ఈ రూ.11440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ నాలుగేళ్లుగా స్టీల్ కార్మికులు, ఈ ప్రాంత ప్రజలు నిర్వహిస్తున్న ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటాన్ని ఆపగలుగుతుందా ? ఉక్కు ఫ్యాక్టరీకి ఊపిరి నిలబెడుతుందా ? ఈ ప్యాకేజీ వెనుక రాజకీయం ఏమైనా ఉందా ? ఇటీవల విశాఖ వేదికగా 'కూటమి' ఆధ్వర్యాన ప్రధానమంత్రి మోడీ పాల్గొన్న సభలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై అటు మోడీ, ఇటు చంద్రబాబు, పవన్ ఎవ్వరూ మాట మాత్రం చెప్పకుండా ఇప్పుడు ఈ ప్యాకేజీ ఎలా తెరపైకి వచ్చేసింది అన్న ప్రధాన ప్రశ్నలు, సందేహాలు పలువురి నుంచి తాజాగా వినిపిస్తున్నాయి. ఎలాగైతేనేమీ ఆర్థిక ప్యాకేజీ రూ.వేల కోట్లు ఉక్కు పరిశ్రమకు కష్టకాలంలో వచ్చిందనుకునే వారూ లేకపోలేదు.

### ఏం జరుగుతోంది ? వాస్తవాలేమిటి ?

2021 జనవరిలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆధ్వర్యానగల ఎకనమిక్ ఎఫైర్స్ కమిటీ 100 శాతం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ / అమ్మకానికి పెడుతూ నిర్ణయం చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ విశాఖ కార్మికవర్గం, ఉత్తరాంధ్ర ప్రజానీకం, సిపిఎం, ఇతర వామపక్షాలు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన గడిచిన నాలుగు సంవత్సరాలుగా పోరాటాలు సాగుతున్నాయి. 2024లో కేంద్ర, రాష్ట్రాల్లో 'కూటమి' డబుల్ ఇంజిన్ సర్కారు వచ్చాక ప్యాకేజీ వదిలారు.. దీని వెనుక రాజకీయ వ్యూహం ఉందన్న ప్రచారం సాగుతోంది. ఒక ఆంగ్ల దినపత్రికలో ఈ ప్యాకేజీపై వచ్చిన వార్త ప్రకారం.. జపనీస్ కంపెనీని త్వరలో షేర్ హోల్డర్‌గా చేసేందుకు మోడీ సర్కారు ఈ ప్యాకేజీని రీస్ట్రక్చరింగ్ కోసం సిద్ధం చేసిందన్నది సారాంశం. కొత్తగా ఉక్కు పరిశ్రమలోకి భాగస్వామిగా




రావాలంటే అప్పు వేల కోట్ల రూపాయలు కనిపించకూడదు కాబట్టి ప్యాకేజీగా ఇచ్చిన డబ్బును ఉక్కు పరిశ్రమ అప్పుకు జమచేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఇలాగే గతంలో పోస్కో కూడా స్టీల్‌ప్లాంట్ బోర్డులోకి జొరబడేందుకు, ఉక్కు పరిశ్రమను కాజేసేందుకు కాలుమోపాలని చూడగా కార్మికవర్గం ఈ యత్నాలను చైతన్యంతో తిప్పికొట్టింది. ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్ 100 శాతం ప్రభుత్వ రంగ పరిశ్రమ. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లోకి రెండే నడుస్తున్నాయి. పూర్తిస్థాయి సామర్థ్యంతో మూడూ నడవాలంటే రూ.7500 కోట్లు అవసరం అవుతుంది. ఇంకా ఆధునికీకరణ పనులకూ నిధులు అవసరం అయినందున కేంద్రం ఈ ప్యాకేజీ ఇచ్చిందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 20 వేల ఎకరాలుగల స్టీల్ ఆస్తులే రూ.21 లక్షల కోట్లుంటే ఈ ప్యాకేజీలు దేనికన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది.

### ప్లాంట్ నడవాలంటే..

సొంత గనులను స్టీల్‌ప్లాంట్‌కు ఇవ్వాలని, సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేస్తోంది. సొంత గనులు లేనందున ఇప్పటికే రూ.12 వేల కోట్లు నష్టం ప్లాంట్‌కు వాటిల్లింది. ఈ సమయంలో ఇప్పుడిచ్చిన రూ.11440 కోట్లు ఏ మూలకు వస్తుంది అన్నది పలువురి ప్రశ్న. ఒక సంవత్సరం ముడిఖనిజం ఖర్చు రూ.18 వేల కోట్లు ప్లాంట్‌కు అవుతోంది. ఇలాంటి ప్యాకేజీ కోసం కార్మికవర్గం పోరాడిందనుకుంటే 'కూటమి' నేతలు ప(త)ప్పులో కాలేసినట్టే. దీన్ని అమ్మకానికి పెట్టిన మోడీ తన నిర్ణయం నుంచి వెనక్కి వచ్చినట్టు కూటమి పాలకులు హామీ ఇవ్వగలరా? అన్నది ప్రధాన ప్రశ్న. మూడు నెలల క్రితం రూ1640 కోట్లును ప్లాంట్‌కు ఇచ్చారు. ఆ డబ్బులు అయిపోయాయి. కార్మికులకు ఐదు నెలలుగా జీతాల్లేవు. తాజా ప్యాకేజీలో జీతాలు చెల్లిస్తారా ? ఏం చేస్తారు ? అనేది ప్రభుత్వం స్పష్టతనివ్వలేని స్థితి కొనసాగుతోంది.






దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న జివిఎంసి కార్మికులు

## స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం హర్షించదగ్గ విషయమే అయినా, అది శాశ్వత పరిష్కారం కాదన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 1390వ రోజుకు చేరాయి. దీక్షల్లో యూనియన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో విఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని, ఐదు వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో మనిషికి జీవనాధారమైన ఆక్సిజన్‌ను విశాఖ స్టీల్ ప్లాంట్ సరఫరా చేసి ప్రాణభిక్ష పెట్టిందన్నారు. దీనిని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. దీక్షా శిబిరంలో కూర్చున్న వారిలో గొలగాని అప్పారావు, ముద్దాడ ప్రసాద్, జెఅర్.నాయుడు, శేషు, ఎం.ఈశ్వరరావు, రాజు తదితరులు ఉన్నారు.

### స్టీల్‌ప్లాంట్ మనుగడకు ప్యాకేజీ చాలదు : వైసిపి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు ప్రకటించిన ప్యాకేజీ వెంటిలేటర్‌పై ఉన్న స్టీల్ ప్లాంట్‌కు ఆక్సిజన్ మాత్రమేనని, స్టీల్‌ప్లాంట్ మనుగడకు ఈ ప్యాకేజీ ఎంత మాత్రమూ సరిపోదని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం మధ్యాహ్నం మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కోసం కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం సంతోషమే అయినా, అది అప్పులకే సరిపోతుందని అన్నారు. ఆ మొత్తంతో స్టీల్ ప్లాంట్ ఏమాత్రమూ గట్టెక్కే పరిస్థితి లేదని తెలిపారు.

# రెవెన్యూ సదస్సులకు 834 దరఖాస్తులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : మండల పరిధిలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లో 834 దరఖాస్తులు అందాయి. వీటిలో రికార్డ్ ఆఫ్ రైటర్స్ (ఆర్ఒఆర్), మ్యూటేషన్‌కు సంబంధించి 518, ఇతరత్రా భూసమస్యలు పరిష్కరించాలని 38, రీసర్వే చేయాలని 38, ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం అయ్యాయని 26 , 22 'ఏ' సమస్య పరిష్కారం చేయాలని 66, అసైన్డ్ భూముల సమస్యలు పరిష్కరించాలని 10 దరఖాస్తులు అందాయి. వీటితోపాటు ఇతరత్రా భూ సంబంధిత సమస్యలపై మరికొన్ని దరఖాస్తులు వచ్చాయి.ఆయా దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

**193 అర్జీల పరిష్కారం**

రెవెన్యూ సదస్సులో వచ్చిన వివిధ భూ సంబంధిత సమస్యల దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 193 పరిష్కరించినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపారు. మిగిలిన వాటిని కూడా నిర్ణీత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**రెవెన్యూ గ్రామాల వారీ దరఖాస్తులు ఇలా..**

రెవెన్యూ సదస్సులో గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలిలా ఉన్నాయి. తగరపువలసలో 15, భీమిలి టౌన్‌లో 9, చిట్టివలసలో 58, సంగివలసలో 22, కుమ్మరిపాలెంలో 13, కెవి భూములు 3, జెవి అగ్రహారంలో 18, కొత్తవలసలో 52, కాపులుప్పాడలో 103, ఆర్‌వై అగ్రహారంలో 15, నిడిగట్టులో 34, నేరెళ్ళవలసలో 14, చేపలుప్పాడలో 35, టి నగరపాలెం, సింగన బందల్లో చెరో 20, మజ్జివలస లో 34, మూలకుద్దులో 9, నారాయణరాజుపేటలో 23, చిప్పాడలో 67, బోడమెట్టపాలెంలో 25, అన్నవరంలో 10, అమనాం18, తాటితూరులో 102, తాళ్ళవలసలో 22, దాకమర్రిలో 98దరఖాస్తులు అందినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి.



రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహశీల్దార్ రామారావు (ఫైల్ ఫోటో)

## గొట్టిపల్లిలో రీసర్వే

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి రెవెన్యూలో సోమవారం నుంచి రీ సర్వే ప్రారంభిస్తామని మండల తహశీల్దార్ పేర్ల శ్యాంప్రసాద్ తెలిపారు. ఐదు బృందాలతో సర్వే పనులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులందరూ అందుబాటులో ఉండాలని కోరారు. సర్వేయర్లతోపాటు విఆర్ఒలు పాల్గొంటారని, ఏమైనా సందేహాలుంటే విఆర్ఒను సంప్రదించాలని సూచించారు.

## 20న సర్వీస్ ప్రొవైడర్ల మేళా

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సర్వీస్ ప్రొవైడర్స్ మేళా నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమప్రసన్న వాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెప్మా, హోమ్ ట్రయాంగిల్ సంస్థ సంయుక్తాధ్వర్యాన స్థానికంగా ఉన్న సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని స్థానిక సర్వీస్ ప్రొవైడర్లకు సూచించారు.

## 25 నుంచి స్ప్రింగ్ ఫీల్డ్ స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి -పద్మనాభం: స్ప్రింగ్ ఫీల్డ్ హైస్కూల్ 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 25, 26 తేదీల్లో భారీ వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటుచేస్తున్నట్లు యాజమాన్య ప్రతినిధి ఆర్‌డి.రత్నరాజు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ఎస్‌టిఎల్ శాస్త్రవేత్త పి.కలపాలా పాల్గొంటారని పేర్కొన్నారు.



# లోడింగ్ కూలి రేట్లు పెంచాలి

### సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి

ప్రజాశక్తి-పద్మనాభం : లారీ లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికుల కూలిరేట్లు, లారీ డ్రైవర్ల వేతనాలు పెంచాలని సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, ఎస్.అప్పలనాయుడు డిమాండ్‌చేశారు. లారీ లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు, డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశం శనివారం సిఐటియు పద్మనాభం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం విధానాల వల్ల కార్మికులకు ఇస్తున్న కూలి రేట్లు, డ్రైవర్లకు ఇస్తున్న జీతాలు ఎటూ చాలడం లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడం, పిల్లల ఫీజులు, వైద్య ఖర్చులు పెరిగిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.సురేష్, బి.నాగరాజు, నాయుడు శ్రీను, వి.అప్పారావు, పి.అప్పలస్వామి, పద్మరాజు, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



లారీ లోడింగ్ కార్మికులతో సిఐటియు నాయకులు మూర్తి

# జీవామృతంతో అధిక దిగుబడి

### వ్యవసాయ శాఖ రీజనల్ అధికారి ప్రకాష్

ప్రజాశక్తి -ఆనందపురం : రైతులు రసాయన ఎరువులకు బదులు జీవామృతాలను వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని, పెట్టుబడులు కూడా తగ్గుతాయని వ్యవసాయ శాఖ రీజనల్ అధికారి ప్రకాష్ తెలిపారు. ఆనందపురం మండలం పాలవలస గ్రామంలో శనివారం రబీ డ్రై సోయింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు 5 రకాల ప్రధాన పంటలతో పాటు రక్షక పంటలుగా మొక్కజొన్న, జొన్న, బంతి సాగు చేయడం వల్ల తెగుళ్ల బెడద తగ్గి అధిక లాభాలు సాధించవచ్చన్నారు. నిరంతర ఆదాయం సమకూరుతుందన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి మోహనరావు ద్రవజీవమృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు అధిక డిమాండ్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ చక్రవర్తి, మోడల్ మేకర్ రామారావు, ఐసిఆర్ పి.నాగమణి పాల్గొన్నారు.


జీవామృతం తయారు చేస్తున్న రైతులు

## నేరాలు ఘోరాలు

### గ్యాస్ లీక్ ఘటనలో మహిళ మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : గ్యాస్ లీక్ ఘటనలో గాయాలై చికిత్స పొందుతున్న మహిళ శనివారం మృతి చెందింది. గత సంవత్సరం డిసెంబర్ 25వ తేదీన పాత డైరీ ఫారం ఇందిరాగాంధీ నగర్‌లో జరిగిన గ్యాస్ లీక్ ఘటనలో ఇద్దరు మహిళలు, మరో వ్యక్తి, ఇద్దరు పిల్లలు గాయపడిన ఘటన విధితమే. వీరు అప్పటి నుంచి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో ఎక్కువ శాతం శరీరం కాలిపోయిన తిరుమలరెడ్డి సత్యవతి(27) శనివారం మృతి చెందింది. ఈమె ఇద్దరి పిల్లలు చికిత్స పొందుతున్నారు. సత్యవతి మృతితో ఇందిరాగాంధీ నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రామాటాకీస్ వద్దనున్న లక్ష్మీ హ్యుందాయ్ షోరూంలో కారును ఆవిష్కరిస్తున్న అతిథులు

## విశాఖ మార్కెట్‌లోకి హ్యుందాయ్ క్రెటా ఇవి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో ఆటోమొబైల్ రంగంలో ప్రఖ్యాతిగాంచిన లక్ష్మీ హ్యుందాయ్ వారు హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కారును శనివారం ఉదయం రామా టాకీస్ వద్ద ఉన్న లక్ష్మీ హ్యుందాయ్ శాఖతోపాటు గాజువాక శాఖలో ప్రారంభించారు. లక్ష్మీ హ్యుందాయ్ గ్రూప్ సిఇఒ డాక్టర్ వి.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ (అకౌంట్స్ అండ్ ఫైనాన్స్) కిషోర్ కుమార్‌ల ఆధ్వర్యంలో రామా టాకీస్ శాఖ వద్ద జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, భగవద్గీత ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎల్‌వి.గంగాధర శాస్త్రి, బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ పిఎం ప్రధాన్‌లు హాజరై నూతన వాహనాన్ని ప్రారంభించారు. అదేవిధంగా గాజువాక శాఖ వద్ద జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెట్రో రీజినల్ మేనేజర్ సంజిత్ కుమార్ దెబ్నాథ్, విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ గోపాల్ హాజరై ఈ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ హ్యుందాయ్ సంస్థ సిఇఒ డాక్టర్ వి.శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలు కలిగిన ఈ హ్యుందాయ్ క్రెటా వాహనం ఇవి రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతుందని అన్నారు. ఈ వాహనం ఎక్స్ - షోరూమ్ ధర రూ.17.99 లక్షల నుంచి రూ.24.37 లక్షలు వరకు ఉంటుందని తెలిపారు. అనంతరం మొదటి కొనుగోలుదారుడైన ముఖేష్ జైన్‌కు ముఖ్య అతిథుల చేతుల మీదుగా తాళాలు అందజేశారు. కార్యక్రమంలో ఖాతాదారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి -ములగాడ : నూతన సంవత్సరం సందర్భంగా హిందూస్తాన్ షిప్‌యార్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన వివిధ క్రీడల పోటీలు నిర్వహించారు. శనివారం జరిగిన క్రికెట్, బ్యాడ్మింటన్, చెస్, కేరమ్స్ ఫైనల్ పోటీలలో విజేతలకు షీల్డ్‌లు అందజేశారు. ముఖ్య అతిథిగా హెచ్ఎస్ఎల్ సిఎమ్‌డి హేమంత్ ఖత్రి హాజరై మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగకరమన్నారు. ఉద్యోగి రోజులో కనీసం ఒకగంట క్రీడలు కోసం కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గిరిదీప్ సింగ్, వెంకటేశ్వర్లు, రాకేష్ ప్రసాద్, ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



విజేతలకు షీల్డ్స్ పంపిణీ చేస్తున్న సిఎమ్‌డి హేమంత్ ఖత్రి



హైకోర్టు న్యాయమూర్తిని సత్కరిస్తున్న ఎయు న్యాయ కళాశాల ప్రిన్సిపల్ సీతామాణిక్యం తదితరులు

## ఎయును సందర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని శనివారం పలువురు ప్రముఖులు సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎయు న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.సీతామాణిక్యం, కళాశాల ఆచార్యులతో మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి అయిన జస్టిస్ సత్తి సుబ్బారెడ్డిని న్యాయ కళాశాల తరపున ప్రిన్సిపల్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ఆచార్యులు చంద్రకళ, డాక్టర్ ఎల్‌వికె.ప్రసాద్, డాక్టర్ కె.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌నాయక్ ఫౌండేషన్ అవార్డు కార్యక్రమానికి విచ్చేసిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎయు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్య నల్లా సత్యనారాయణ, ఆచార్య చల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులపై వేధింపులు తగవు

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు కార్మికులను చర్చలకు పిలిచి వేధించడం దుర్మార్గమని గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు బి.జగన్ పేర్కొన్నారు. అదానీ గంగవరం పోర్టు ప్రధాన సమస్యలపై విశాఖ లా అండ్ ఆర్డర్ డిసిపి- 2 మేరీ ప్రశాంతి, అదానీ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ కమిటీ సభ్యులు 12 మందిని గాజువాక పోలీస్ స్టేషన్‌కు పిలిపించారని తెలిపారు. ఆమెతో జరిగిన సంభాషణలో కార్మికుల సమస్యలు వివరించినప్పటికీ సమస్యలపై స్పందించకుండా.. పోర్టు కార్మికులకు సంబంధం లేని మాటలు ఆడుతూ సమస్యను పక్కదారి పట్టించే విధంగా వ్యవహరించారని విమర్శించారు. కార్మిక సమస్యలపై మాట్లాడాలని చెపితే డిసిపి తిరస్కరించారని తెలిపారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాటం కొనసాగుతుందని అదాని గంగవరం పోర్టు ఎంప్లాయిస్ కమిటీ సభ్యులు స్పష్టంచేశారు. అఖిలపక్ష రాజకీయ పార్టీలు, యూనియన్ సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతుతో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదాని గంగవరం పోర్టు ఎంప్లాయిస్ కమిటీ సభ్యులు నొల్లి తాతారావు, అమ్మోరు సత్యానందం, ఎల్లాజి అప్పారావు, స్వామి , సత్యారావు, అప్పలరాజు పాల్గొన్నట్లు తెలిపారు.

## స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీపై హర్షం

ప్రజాశక్తి-యంత్రాంగం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ప్యాకేజీ ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

**సీతమ్మధార** : స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడం సంతోషకరంగా ఉందని జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్ రామకృష్ణ పేర్కొన్నారు. సీతంపేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తూ, వారికి ధన్యవాదాలు తెలిపారు.

**ఉక్కునగరం** : విశాఖ స్టీల్ ప్లాంటుకు 11 వేల 440 కోట్లు ప్రత్యేక పునరుద్ధరణ ప్యాకేజీని అందించిన ప్రధాని మోడీకి మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ ధన్యవాదాలు తెలిపారు. కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యాన కూర్మన్నపాలెం ఆర్చ్ వద్ద ప్రధాని మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు.

**విశాఖ కలెక్టరేట్** : విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించడం అభినందనీయమని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు టి.శ్రీరామమూర్తి, జె.రవి తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# గెడ్డకు మెస్ ఏర్పాటుచేయాలి

### జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్

ప్రజాశక్తి-సీతమ్మధార : నరేంద్ర గర్ ప్రధాన గెడ్డలో ప్రజలు వ్యర్థాలు వేయకుండా ఇరువైపులా మెస్‌ను ఏర్పాటు చేయాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జివిఎంసి 43వ వార్డు పరిధిలోని నరేంద్రనగర్, ఎంఎస్ఎఫ్-5, తాటి చెట్ల పాలెం హైవే వద్ద ఉన్న అన్న క్యాంటీన్ తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. నరేంద్ర నగర్ గెడ్డకు మెస్ ఏర్పాటు, వీధిలో ఉన్న ఐరన్ బ్రిడ్జి తొలగించి ఆర్‌సిసి బ్రిడ్జి నిర్మాణం, పలు వీధుల్లో విద్యుత్ దీపాలతో కూడిన ఎలక్ట్రికల్ పోల్స్‌ను ఏర్పాటుచేయాలని కమిషనర్‌ను వార్డు కార్పొరేటర్ కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ఈ ప్రతిపాదనలను పరిశీలించాలని పర్యవేక్షక ఇంజనీర్‌ను ఆదేశించారు. కాలనీలో పలు చోట్ల విద్యుత్ దీపాలతో కూడిన ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఎందుకు చేయలేదని ఎమినిటీస్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విద్యుత్ పోల్స్, వీధిలైట్లు ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వార్డులో అస్తవ్యస్తంగా వున్న కేబుల్, విద్యుత్ వైర్లను గుర్తించి ప్రజలకు ప్రమాదాలు జరగకుండా కేబుల్ ఆపరేటర్ల యాజమాన్యంతో మాట్లాడి క్రమబద్ధీకరించాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ శాస్త్రిని ఆదేశించారు. వార్డులో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ, గెడ్డలు, కాలువలలో వ్యర్థాలు తొలగింపు తదితర చర్యలు చేపట్టడంతో పాటు నిత్యం పర్యవేక్షించాలని ఎఎమ్‌ఒహెచ్ డాక్టర్ సునీల్ కుమార్‌ను కమిషనరు ఆదేశించారు. అనంతరం తాటిచెట్లపాలెం వద్ద ఉన్న ఎంఎస్ఎఫ్ -5ను పరిశీలించారు. వ్యర్థాలు నిలవలేకుండా డంపింగ్ యార్డ్ కు తరలించాలని జోనల్ కమిషనర్ బి.రామును ఆదేశించారు. సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. జోన్ పరిధిలోని ఉన్న అన్ని అన్న క్యాంటీన్లను నిత్యం పర్యవేక్షించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ పర్యటనలో జివిఎంసి కార్యనిర్వాహక ఇంజినీర్లు మురళీకృష్ణ, తారా ప్రసన్న, శానిటరీ సూపర్‌వైజర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



నరేంద్రనగర్ గెడ్డను పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్

# జాబ్ మేళాలో 35 మంది ఎంపిక




జాబ్ మేళాలో ఎంపికైన వారితో మిలీనియం సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్వారకానగర్‌లోని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో శనివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 35 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ పొందినట్లు సంస్థ సెంట్రల్ మేనేజర్ వరదా రవికుమార్ తెలిపారు. ఎంఎస్ భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, విశాఖపట్నం అసోసియేట్ సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగాల కోసం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. క్యాంపస్ డ్రైవ్‌లో 250 మంది బి.టెక్ తాజా పట్టభద్రులు/గ్రాడ్యుయేట్లు పైథాన్, జావా, నెట్‌లో మంచి నైపుణ్యం ఉన్నవారు పాల్గొన్నారని తెలిపారు. వీరిలో 35 మందికి ప్లేస్‌మెంట్ లభించిందని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహించే యోచనలో ఉన్నామని తెలిపారు. మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రస్తుతం డేటా సైన్స్, ఎడబ్ల్యుఎస్, డెవ్‌ఓప్స్, ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ వంటి ట్రెండింగ్ కోర్సులను పరిశ్రమకు అనుగుణంగా, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అందిస్తుందని పేర్కొన్నారు. మిలీనియం హెచ్‌ఆర్ మేనేజర్ దివ్య జ్యోతి మాట్లాడుతూ, తదుపరి క్యాంపస్ డ్రైవ్ సివిల్ విద్యార్థుల కోసం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. 25 సంవత్సరాల అనుభవంతో మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఇప్పటివరకు 5 లక్షల మందికి పైగా విద్యార్థులకు ప్లేస్‌మెంట్లను అందించిందని తెలిపారు. భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ సిస్టమ్ అనలిస్ట్ ఎన్‌విబి.ప్రదీప్, వెబ్ అప్లికేషన్ అభివృద్ధిలో కృత్రిమ మేధ ప్రాముఖ్యతను వివరించారు. అభ్యర్థులు మంచి కెరీర్ అవకాశాల కోసం డేటా సైన్స్ వంటి అత్యున్నత సాఫ్ట్‌వేర్ కోర్సులు నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జి.సాగర్, వై.రాజు, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జియ్యాని శ్రీధర్

## అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి -కరాస: జివిఎంసి 52వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శనివారం పరిశీలించారు. న్యూ కరాస ప్రాంతంలోని సిసి రోడ్లు , కాలువల నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. నాణ్యతాలోపం ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఎఇ ఉష, ఇంజనీరింగ్ విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్, వార్డు సెక్రటరీలు పాల్గొన్నారు.

## బీమారంగం ప్రయివేటీకరణకు ఎన్‌డిఎ యత్నం

ప్రజాశక్తి -గాజువాక : బీమారంగాన్ని ప్రయివేటీకరణ చేయడానికి ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ గాజువాక సిపిఐ బ్రాంచ్ యూనిట్ కార్యదర్శులు జయశ్రీ, శ్రీనివాసులు తెలిపారు. ఎఫ్‌డిఐ 100 శాతం పెంపు, ఐపిఒలో శాతం పెంపు వంటి ప్రతిపాదనల ద్వారా భారతీయుల విశ్వాసాన్ని గెలుచుకున్న ఎల్‌ఐసిని బలహీనపరచాలని యత్నిస్తోందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఎల్‌ఐసిని మరింత బలోపేతం చేయడం అత్యంత అవసరం అన్నారు. ఎల్‌ఐసి మనుగడకు హాని కలిగించే చర్యలను ఐక్యంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ఎల్‌ఐసి జాతీయీకరణ దినం సందర్భంగా ఉద్యోగులందరూ బ్యాడ్జీ ధరించడం, నూతన వ్యాపారం కోసం పాటుపడడం, ఏజెంట్లను ఉత్తేజ పరిచి నూతన వ్యాపారం చేసేలా వారిని సమాయత్త పరచాలని కోరారు. ఏజెంట్లు, అభివృద్ధి అధికారుల భాగస్వామ్యం ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎల్‌ఐసి సేకరించిన పొదుపు మొత్తాలను దేశ నిర్మాణంలో ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.

# సత్తిరాజుకు అశ్రునివాళి

ప్రజాశక్తి -ములగాడ : ప్రముఖ రచయిత, కవి, గ్రంథాలయ కమిటీ సభ్యులు కరకు సత్తిరాజు సంస్మరణ సభను శనివారం మల్కాపురం శాఖ గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ కమిటీ కార్యదర్శి ఆర్‌సిహెచ్.వెంకటరావు మాట్లాడుతూ, సత్తి రాజు గ్రంథాలయాలకు చేసిన సేవ మరువలేనిదన్నారు. సత్తి రాజు అముద్రిత రచనలను ప్రచురించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రముఖ పాత్రికేయులు సుంకర చలపతిరావు మాట్లాడుతూ, సత్తి రాజు రచించిన దువ్వాడ రైల్వే స్టేషన్ రచనను అన్ని గ్రంథాలయాల్లోనూ ఉంచాలని కోరారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ, సత్తిరాజు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా, సాహిత్యం ద్వారా సమాజాన్ని చైతన్యం పరిచారని కొనియాడారు. ప్రముఖ కార్మిక నాయకులు బి.సత్యానందం మాట్లాడుతూ, సత్తిరాజు ఆదర్శాలను అనుసరించాలన్నారు. సమావేశంలో గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఐవిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి, పాత్రికేయులు కెవిఎల్. నరసింహం, గోపాలపట్నం గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం, షిప్ యార్డ్ గ్రంథాలయాధికారి బి.కనకరాజు, గాజువాక గ్రంథాలయాధికారి చంద్రకళ పాల్గొని సత్తిరాజుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సత్తిరాజు మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.



సత్తిరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ కమిటీ సభ్యులు

# ఘనంగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

## దర్శించుకున్న పలువురు నాయకులు


వివిధ వేషాలతో నృత్యాలు చేస్తున్న కళాకారులు

**ప్రజాశక్తి-అనకాపల్లి**

అనకాపల్లి వేల్పుల వీధి శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేసి రథంపై పట్టణ పురవీధుల్లో గౌరీ పరమేశ్వరులను ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారిని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ మౌలిక వసతులు కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ, లీడర్ పేపర్ ఎడిటర్ వివి రమణమూర్తి, మాజీ ఎంపీ డాక్టర్ సత్యవతి విష్ణుమూర్తి, విశాఖ డెయిరీ డైరెక్టర్ మాజీ మలసాల రమణరావు, కార్పొరేటర్లు మందపాటి సునీత జానకిరామరాజు, జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్ తదితరులు దర్శించుకున్నారు. వీరిని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ గౌరీ పరమేశ్వర మహోత్సవానికి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రావణి, పట్టణ సీఐ టీవీ విజయ్ కుమార్ భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పుల గణేష్, సభ్యులు, వేల్పుల వీధి పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.


రథయాత్రను ప్రారంభిస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాంకీ


గుర్రపు పరుగు పందెం నిర్వహిస్తున్న దృశ్యం

## జిల్లా స్థాయి గుర్రపు పరుగు పందేలు

**ప్రజాశక్తి-చోడవరం :** మండల కేంద్రంలో భూలోకమాంబ తీర్థ మహోత్సవ సందర్భంగా శనివారం జిల్లా స్థాయి గుర్రపు పందాలు నిర్వహించారు. ఉదయం నుండి సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తీర్థానికి గుర్రపు పందేలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటిలో పాల్గొన్న విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. రాత్రి సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

## విఘ్నేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

**ప్రజాశక్తి-సబ్బవరం :** మండల కేంద్రంలో పునర్నిర్మాణం జరుగుతున్న శివాలయం పక్కన నూతనంగా నిర్మించనున్న విఘ్నేశ్వర ఆలయానికి మండలంలోని రావులమ్మపాలెం గ్రామానికి చెందిన శ్రీవినాయక బిల్డింగ్ కన్స్ట్రక్షన్ అధినేత గొంప ముత్యాలనాయుడు రూ.5,00,116 విరాళాన్ని ఆలయ కమిటీకి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి నాని, దంగేటి ప్రకాశ్, గెడ్డం కృష్ణ, కోరాడ శ్రీను, బర్ల రమణ, కొల్లి కృష్ణ, బేతిన శ్రీనివాసరావు, చింతల శ్రీనివాసరావు, చింతల జగన్నాథం, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, గెడ్డం రమణ తదితరులు పాల్గొన్నారు

**శివాలయానికి...**

మండల కేంద్రంలోని శివాలయం పునర్నిర్మాణానికి సబ్బవరం పంచాయతీ శివారు చిన్నగొల్లల పాలెం గ్రామానికి చెందిన సింగంపల్లి అప్పలనాయుడు రూ.25,116 విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు.

## నేడు చౌడువాడలో ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి-కె.కోటపాడు :** మండలంలోని చౌడువాడ గ్రామం శతకం రామాలయం వద్ద ఆదివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ దాడి ఎరుపు నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిల సహకారంతో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కంటి వైద్య శిబిరాన్ని కంటి సమస్యలు ఉన్న రోగులు ఉపయోగించుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చే రోగులు తమ పాత వైద్యానికి సంబంధించిన చీటీలు, ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డులు పట్టుకొని రావాలని కోరారు.

## ప్రశాంతంగా నవోదయ పరీక్షలు

**ప్రజాశక్తి-కె.కోటపాడు :** జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్వీ పద్మావతి ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. జవహర్ నవోదయ విద్యాలయ విశాఖపట్నంకు చెందిన అధికారితో పాటు 15 మంది ఇన్విజిలేటర్లు పరీక్షల నిర్వహణలో పాల్గొన్నారు. కే. కోటపాడు దేవరాపల్లి మండలాలకు చెందిన 192 మంది ఇంగ్లీష్ మీడియం, 132 మంది తెలుగు మీడియం విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాశారు.

**నక్కపల్లి :** నక్కపల్లి గురుకులంలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కేంద్రంలో .240 మంది విద్యార్థులు పరీక్షలకు రాయాల్సి ఉండగా, 211 మంది హాజరయ్యారని, 29 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఆర్.నాగన్నదొర తెలిపారు. ఉమ్మడి జిల్లా పరీక్షల నిర్వహణాధికారి శ్రీధర్‌రెడ్డి, ఎంఇఒలు కె.నరేష్, వేమగిరి నూకరాజు, స్క్వాడ్ బృందం పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు.


పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కిశోర్ తదితరులు

## జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

**ప్రజాశక్తి-అచ్యుతాపురం :** మండలంలోని మల్లవరం గ్రామంలో నందీశ్వరీ స్వామి తీర్థం సందర్భంగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు పంచాయితీ సెక్రటరీ కిషోర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను వాసు పరిచయం చేసుకున్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లవరం గ్రామ సర్పంచ్ పిన్నమ్మరాజు వాసు, కే శ్రీనివాసరావు, చందక శివ, బత్తిన రమణ తదితరులు పాల్గొన్నారు.

## గోవాడ సుగర్స్ కార్మికుల ఆందోళన విరమణ

**ప్రజాశక్తి-చోడవరం :** స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు హామీతో చోడవరం సుగర్స్ కార్మికులు శనివారం ఆందోళన విరమించి విధుల్లోకి చేరారు. తమకు బకాయి పడ్డ వేతనాలు గ్రాడ్యుటీ, పదవి విరమణ చేసిన వారికి ఇవ్వవలసిన నగదు వంటి వాటిపై గత కొన్ని రోజులుగా కార్మికులు విధులను బహిష్కరించి ఆందోళన చేస్తున్నారు. క్రషింగ్ ప్రారంభానికి ఆలస్యం అవ్వడంతో స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని శుక్రవారం ఫ్యాక్టరీ కార్మికులు అందరితో సమావేశం ఏర్పాటు చేసి తమకు రావలసిన జీతాలు ఇతర బకాయిలు రెండు మూడు రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సుగర్స్ ఎండి వి సన్యాసినాయుడు, యూనియన్ నాయకులు కే భాస్కర్‌రావు, ఎస్ రామనాయుడు, రావి సూరిబాబు ఇతర అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి-మునగపాక :** మండలంలోని చూచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల తిమ్మరాజుపేట గ్రామంలో ఎఫ్‌డిపి కార్యక్రమాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి రవికుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న సేవలను హెల్త్ సూపర్వైజర్ లక్ష్మణ్‌ను, ఎమ్ఎల్‌హెచ్‌పి కిన్నెరను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ రవికుమార్

# ఆరుబయట తగలబెట్టిన ఫార్మా వ్యర్థాలు

## క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఐటియు డిమాండ్

**ప్రజాశక్తి-పరవాడ**

పరవాడ ఫార్మాసిటీలోని ఫార్మా కంపెనీల వ్యర్థాలను మండలంలోని తాడి గ్రామాన్ని ఆనుకొని శివాలయం దగ్గర కొండ ప్రాంతంలో విచ్చలవిడిగా పడవేసి గుట్టు చప్పుడు కాకుండా తగలబెట్టారు. దీంతో ఈ ప్రాంతమంతా తీవ్రమైన కాలుష్యం వెదజల్లుతోంది. ఈ నేపథ్యంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, డివైఎఫ్ఐ నాయకులు గల్లా భార్గవ్ శనివారం వ్యర్థాలు మండిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాంకీ యాజమాన్యం చెక్ పోస్టులు సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల వ్యర్థాలు ఆరుబయట గ్రామాలను ఆనుకొని పడవేసి మండిస్తున్నారని తెలిపారు. దీనివల్ల తీవ్ర కాలుష్యం వెదజల్లబడుతుందని చెప్పారు. దీనిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, రెవిన్యూ, పోలీస్ డిపార్ట్మెంట్లు విచారణ చేసి, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.


తగలబెట్టిన ఫార్మా వ్యర్థాలను పరిశీలిస్తున్న గనిశెట్టి

# జోరుగా కోడి పందేలు, బల్లాటలు


గొబ్బూరులో కోడి పందెం జరుగుతున్న దృశ్యం

**ప్రజాశక్తి-కశింకోట**

కశింకోట మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న తీర్థాలు సందర్భంగా కోడిపందాలు, బల్లాటలు జోరుగా సాగుతున్నాయి. పోలీసులు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేసిన నిర్వాహకులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా చాలా మామూలుగానే పందేలు నిర్వహిస్తున్నారు. మండలంలోని గొబ్బూరు గ్రామ శివారున ఉన్న పోలవరం కాలవ గట్టు సమీపంలో కోడిపందేలు, బల్లాటలు శనివారం రోజంతా జరిగాయి. ఈ కోడిపందాలు ఒక వ్యసనంగా మారితే యువకుల భవిష్యత్తుకు మరింత ముప్పు వాటిల్లే ప్రమాదముందని పలువురు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల కోడిపందాల్లో గొడవలు కూడా జరిగిన సందర్భాలు లేకపోలేదు. పోలీసులు నిఘా ముమ్మరం చేసి కోడిపందాలు, బల్లాటలు ఆడకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై సీఐ అల్లు స్వామి నాయుడు వివరణ కోరగా గ్రామాల్లో కోడిపందాలు ఆడకుండా నిర్వాహకులకు హెచ్చరికలు కూడా జారీ చేశామని, భేఖాతరు చేసిన వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నామని చెప్పారు.

## ప్యాకేజీతో ఊరట

**ప్రజాశక్తి-అనకాపల్లి :** విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.11,400 కోట్లు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం పట్ల ఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు బుద్ధ రాజేష్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాలుగా కార్మికులు, కర్షకులు, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు చేస్తున్న పోరాటానికి, ఆంధ్రప్రదేశ్లో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు వివిధ రకాలగా ఉద్యమాలు, ధర్నాలు బంద్‌లు, గత వైసిపి రాష్ట్ర ప్రభుత్వం 2021 జనవరిలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా ఆపడం కోసం అసెంబ్లీలో తీర్మానం చేయడం వంటి చర్యలకు కేంద్రం స్పందించిందని పేర్కొన్నారు. నేడు అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమికి పూర్తి మెజార్టీ లేకపోవడం ఆంధ్ర ప్రదేశ్‌లో ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలపై కేంద్ర ప్రభుత్వం ఆధారపడడం వల్ల ఆంధ్ర రాష్ట్రానికి నేడు ఈ ఆర్థిక ప్యాకేజీ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఇది తాత్కాలిక ఊరట అని, నిజంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఊపిరి పోయాలంటే సొంత గనుల కేటాయించాలని అప్పుడే ఈ బీజేపీ ప్రభుత్వం చిరస్థాయిగా సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు.

## టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న డాక్టర్ నారాయణరావు

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కేకేవిఎ నారాయణరావు తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు లక్ష రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ నారాయణరావు లాంటి వ్యక్తులు పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకోవడంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ కోటి మంది సభ్యత్వం ఉన్న తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం పొందడం ఆనందంగా ఉందన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం నియోజకవర్గ పరిధిలో 21 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.8,90,350 ఆర్థిక సహాయం చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చోడవరం టిడిపి కార్యాలయంలో శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసిన వాళ్ళు లభించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగ గంగాధర్, మాజీ జెడ్పిటిసి కనిశెట్టి సన్యాసిరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మజ్జి గౌరీ శంకర్, సక్కురు కోటేశ్వరరావు, దేవరపల్లి వెంకట అప్పారావు, అన్నవరం టిడిపి నాయకులు చిన్న, నెమలహరి తదితరులు పాల్గొన్నారు.

## పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఈనెల 20 నుండి 31వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఈ దినేష్ కుమార్ తెలిపారు. పశువులకు, లేగ దూడలకు, గొర్రెలు, మేకలు, కోళ్లకు టీకాల కార్యక్రమం ఉంటుందన్నారు. అనారోగ్యంతో ఉన్న ఎదకురాని గర్భకోశ వ్యాధులు గల పశువులకు ఉచితంగా చికిత్స అందిస్తామని చెప్పారు. ప్రతిరోజు రెండు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ శిబిరాల్లో తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ చికిత్సల వలన పాడిపశువులు , గొర్రెలు మేకలలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఉత్పాదక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా రైతులను కోరారు.

**బుచ్చయ్యపేట** : ఈనెల 20 నుండి 31 తేదీ వరకు రోజుకు రెండు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బుచ్చయ్యపేట పశువైద్యాధికారిణి వై.ఉమామహేశ్వరి శనివారం తెలిపారు. ఈ వైద్య శిబిరాల్లో వడ్డాది, రాజాం, బుచ్చయ్యపేట పశు వైద్యాధికారులు, సహాయకులు వైద్య సేవలు అందిస్తారని, రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

## గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి, తవ్వవానిపాలెం, ఇరువాడ, పైడివాడ అగ్రహారం గ్రామాలలో సీతారాముల తీర్థ మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గుల్లేపల్లిలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామనాయుడు, బందారు మంగ శ్రీను ఆధ్వర్యంలోనూ, తవ్వవానిపాలెంలో సర్పంచ్ బోకం స్వామినాయుడు ఆధ్వర్యంలోనూ, పైడివాడ అగ్రహారంలో ఆలయ కమిటీవారు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలోనూ జరిగాయి. ఈ కార్యక్రమంలో అక్కిరెడ్డి దుర్గి నాయుడు, రామలక్ష్మి, బొబ్బరి కన్నారావు, కోన సత్యనారాయణ, రాపర్తి ముత్యాలనాయుడు, మడక సూరిబాబు, సియాద్రి లక్ష్మణరావు, అక్కిరెడ్డి అచ్చిబాబు, అక్కిరెడ్డి పెద చిన్నోడు పాల్గొన్నారు.

**కశింకోట** : మండలంలోని జోగారావు పేట గ్రామంలో శ్రీసీతా రాముల గ్రామ తీర్థం శనివారం నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను గ్రామ నాయకులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు అల్లం గంగ శ్రీనివాసరావు, సర్పంచ్ పువ్వుల సన్యాసిరావు, నాయకులు మండప నాగేశ్వరరావు, బండారు వెంకటేష్, కడియం నాగ చిరంజీవి, పాల్గొన్నారు.

## నేడు కనకమహాలక్ష్మి తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి-యలమంచిలి : ధర్మవరం శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిటీ ఛైర్మన్ కొరారు సాంబశివరావు మాట్లాడుతూ అమ్మవారి వార్షిక మహోత్సవం 1968 నుండి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విలేకర్ల సమావేశంలో కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు కొరారు కొండబాబు, మడగల సత్యనారాయణ, పిల్లా రాము, కె.సూర్యప్రకాష్, తేటకలి నాగేశ్వరరావు, కె.నరేష్ పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## పలుచోట్ల స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్



అనకాపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఆర్ఒ సత్యనారాయణరావు



ప్రతిజ్ఞ చేస్తున్న భీమిలి జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, సర్పంచ్ జివి.నారాయణ

ప్రజాశక్తి- యంత్రాంగం

**ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో శనివారం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా పలు చోట్ల ర్యాలీలు నిర్వహించారు. పారిశుధ్య పనులు చేపట్టారు.**

**అనకాపల్లి** : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం అనకాపల్లి కలెక్టరు కార్యాలయ పరిసరాలను వివిధ శాఖల సిబ్బంది శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిపిఒ జి.రామారావుపాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రత చేపట్టారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.అప్పారావు, ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి, ఎస్సైలు రమణయ్య, వెంకన్న, ఆదినారాయణ, కామేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతి ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న తుప్పలు తొలగించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిఐ రవికుమార్, సెక్యూరిటీ సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

**యలమంచిలి** : మండలంలోని పులపర్తిలో జరిగిన 'స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పాల్గొన్నారు. రోడ్డు పక్క మురికి కాల్వల్లో పేరుకు పోయిన చెత్తను స్వయంగా కాసేపు తొలగించారు. చెత్త నిర్వహణ పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు పాల్గొన్నారు.

యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ ప్రసాదరాజుల ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమం జరిగింది. న్యూ ఇయర్ - క్లీన్ స్టార్ట్ కార్యక్రమం చేపట్టినట్లు కమిషనర్ ప్రసాదరాజు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**దేవరాపల్లి** : మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బూరె బాబురావు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీ చేపట్టారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను ప్రజలచేత చేయించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమర బాబురావు, కడిమి నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు

**కె.కోటపాడు** : మండలంలోని చౌడువాడలో గ్రామ సర్పంచి దాడి ఎరుకునాయుడు, పంచాయితీ కార్యదర్శి పి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఇందిరమ్మ కాలనీ, చల్లవారి వీధిలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రం వద్ద మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.పి. సాంబశివరావు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, ఈఓపిఆర్‌డి రమణి. పంచాయతీ గుమస్తా జి.అప్పారావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

**చోడవరం** : చోడవరం పంచాయతీ శివారు రేవల్ల గ్రామంలో అధికారులు స్వచ్ఛ దివస్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, ఎంపీడీవో ఆంజనేయులు, ఈ ఓపిఆర్డి మహేష్, స్థానిక సర్పంచ్ నూకాలమ్మ పాల్గొన్నారు.

**మాడుగుల:** మాడుగుల సంత ప్రాంతంలో స్వచ్ఛ ఆంధ్ర పారిశుధ్య కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అన్నా క్యాంటీన్ స్థలాన్ని పరిశీలించారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపిపి రాజారాం, ఎంపిడిఓ కొంకి అప్పారావు, తహశీల్దార్ కె. రమాదేవి, పంచాయతీ ఇఒ కె మూర్తి బాబు పాల్గొన్నారు.

**కోటవురట్ల** :మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ, ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. సర్పంచ్ అనిల్ కుమార్, పిఆర్ ఇంజనీర్ వర్మ, ఆరోగ్య విస్తరణ అధికారి గోవిందరావు, ఇఓపిఆర్‌డి రఘురాం పాల్గొన్నారు.

**రావికమతం** : మండల కేంద్రంలో ఎంపిపి పైలా రాజు, ఎంపిడిఒ వెంకన్నబాబు ఆధ్వర్యంలో. స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరుతూ పురవీధుల్లో అవగాహన ర్యాలీ, నాలుగురోడ్ల కూడలిలో మానవహారం నిర్మించారు.. కవగుంట గ్రామంలో సర్పంచ్ దాసరి సూర్యకుమారి, కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యంతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.

**నక్కపల్లి** : స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ పరిసర ప్రాంతాలను ఎంపిడిఒ డి సీతారామరాజు ఆధ్వర్యంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో కలిసి పరిశుభ్రం చేశారు. చెత్త మొక్కలను తొలగించారు. అనంతరం బోదుగల్లంలో గ్రామపంచాయతీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మసీదు, రోడ్డు పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌ఛార్జి ఇఓపిఆర్‌డి శ్రీను పాల్గొన్నారు.

**ఎస్ రాయవరం** : మండలం కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో ఎంపిడిఒ సత్యనారాయణ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు, ప్రతిజ్ఞ చేయించారు. మండల ప్రత్యేక అధికారి కె.మనోరమ, డిటి నీరజ, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఎంపిటిసి బైపా శ్రీనివాస్, కందుల వెంకటేశ్వరరావు, బత్తుల వాసు పాల్గొన్నారు.

**గొలుగొండ** : స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఎస్ఐ పి.రామారావు ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేశారు.పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఎస్ఐ కోరారు. కృష్ణదేవిపేట అటవీ రేంజ్ కార్యాలయ ఆవరణను స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో అధికారి పరిశుభ్రం చేశారు. డిప్యూటీ రేంజ్ అధికారి సత్యనారాయణ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**రోలుగుంట** : మండలంలోని ఎంకే.పట్నం గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో మండల ప్రత్యేకాధికారి జీ.మనోహర్ ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఎంపిడిఒ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**పద్మనాభం** : పద్మనాభం మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్, తహశీల్దార్ కె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

**ఆరిలోవ** : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) పరిసరాలను వైద్యులు, సిబ్బంది శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ స్వచ్ఛ ఆంధ్ర దివస్ కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**భీమునిపట్నం** : స్థానిక సిహెచ్‌సి, వ్యవసాయ శాఖ, ఎంపిడిఒ, తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాల పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల అధికారులు, వైద్యులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాల్లో సిహెచ్‌సి వైద్యులు, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎంబి మల్లికార్జునరావు, డాక్టర్ బి.శోభారాణి, మండల పరిషత్ ఉద్యోగులు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్, వ్యవసాయ శాఖాధికారి బి.శివకోమలి పాల్గొన్నారు.

మండలంలోని సింగనబంద పంచాయితీ పరిధిలో 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, సర్పంచ్ జివి.నారాయణ పాల్గొన్నారు.

**మధురవాడ** : జివిఎంసి 5వ వార్డు పరిధి స్వతంత్రనగర్ పార్కులో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యాన స్థానిక మహిళలు, యువత మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. పౌరులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాకర శ్రీనివాస్ పాల్గొన్నారు.

**సీతమ్మధార** : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

**పెందుర్తి** : జివిఎంసి 96వ వార్డు పరిధి రైతు బజార్‌లో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ వివిఎస్‌పి షర్మిల, సహాయకులు,పాల్గొన్నారు

**వేపగుంట** : జివిఎంసి 95వ వార్డు పురుషోత్తపురం హౌసింగ్ బోర్డ్ కాలనీ పార్కులో వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆధ్వర్యాన పరిశుభ్రత చేపట్టారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చిక్కాల సతీష్, బొడ్డు గురునాథ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

**గోపాలపట్నం** గోపాలపట్నం రైతుబజార్‌లో రైతులు, వ్యాపారులు, సిబ్బంది కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం రైతులతో రైతు బజార్ ఎస్టేట్ అధికారి ప్రసాదు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.



కె.కోటపాడు మండలం చౌడువాడలో పారిశుధ్య పనులు చేస్తున్న సర్పంచ్




కాలువలో పూడిక తీస్తున్న చోడవరం ఎమ్మెల్యే రాజు

# ఎన్‌టిఆర్‌కు ఘననివాళి



బీచ్‌రోడ్డులో ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న శ్రీభరత్, గంటా

ప్రజాశక్తి-యంత్రాంగం

**తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు వర్ధంతిని పలుచోట్ల శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.**

**ఎంవిపి.కాలనీ :** బీచ్ రోడ్డులో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, టిడిపి నాయకులు చోడే వెంకట పట్టాభి, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

**నర్సీపట్నం టౌన్** : స్థానిక ఎన్‌టిఆర్ మినీ స్టేడియం, పిఎన్‌ఆర్ పాలెం సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ ఆశయాలు, త్యాగాలను స్మరించుకున్నారు.సినీ, రాజకీయ రంగాల్లో ఎన్‌టిఆర్ ప్రాభవాన్ని, ఆయన చేసిన సేవలు, సంస్కరణలను కొనియాడారు. కోటి సభ్యత్వాలతో తెలుగు దేశం పార్టీ ఘనకీర్తి ఎన్‌టిఆర్ ఘనతేనని విజయ్ అన్నారు.

**కోటవురట్ల:** మండల కేంద్రంలో జానకి శ్రీను, జల్లూరు గ్రామంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు పాములవాక గ్రామంలో వేచాలపు జనార్ధన్, భాస్కరరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు, గొట్టువాడ, చౌడువాడ గ్రామంలో ఎన్టీఆర్ చిత్రపటానికి సుంకర బాబ్జి నివాళులర్పించారు.

**నక్కపల్లి** : మండలంలోని ఉపమాకలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి శ్రీను, సర్పంచ్ ప్రగడ వీరబాబు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. నక్కపల్లిలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కురుందాసు నూకరాజు, ఉద్దండపురంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మల వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

**రావికమతం :** మండల కేంద్రంలోని పాల సంఘం ఆవరణలో ఎన్‌టిఆర్ విగ్రహానికి రావికమతం సర్పంచి గంజి మోదినాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు మండలంలో గుమ్మాలపాడు, చినపాచీల, కొత్తకోటలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి వేపాడ నాగేశ్వరరావు, పులగాయల గోవింద్ పాల్గొన్నారు.

**మాడుగుల** : తెలుగువారి ఆత్మగౌరవాన్ని అన్న ఎన్‌టిఆర్ విశ్వవిఖ్యాతం చేశారని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మాడుగులలో ఎన్టీఆర్ వర్ధంతిలో పాల్గొని, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు పళ్ళు రొట్టెలనుపంపిణీ చేశారు కార్యక్రమంలో మాజీ ఎంపిపి పుప్పాల అప్పలరాజు,టీడీపీ, జనసేన మండల అధ్యక్ష కార్యదర్శులు,అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, దాసరి అచ్యుతరావు పాల్గొన్నారు.

**ఎస్ రాయవరం :** మండల కేంద్రంలో గురజాడ అప్పారావు ఆడిటోరియంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి మాజీ సర్పంచ్ కందులు వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు గ్రామ శాఖ అధ్యక్షులు మంచాల నానాజీ, బత్తుల వాసు అంకబత్తుల రమణ, భీమరశెట్టి సత్యనారాయణ, కర్రి శ్రీను, అడ్వకేట్ యడ్ల ఆంజనేయులు, దుబాసి రమేష్, కోన బుజ్జి పాల్గొన్నారు.

**రోలుగుంట** : రోలుగుంటలో ఎన్‌టిఆర్ విగ్రహానికి ఉప సర్పంచ్ సుర్ల నరసింహమూర్తి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని కొనియాడారు.

**గొలుగొండ** : గొలుగొండలో మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, పాయకరావుపేట గ్రామంలో మాజీ సర్పంచ్ కామిరెడ్డి రామన్న, ఏఎల్.పురం గ్రామంలో మాజీ జెడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. నీటి సంఘం మాజీ అధ్యక్షులు మూకల శ్రీహరి పాల్గొన్నారు. ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం జరిగింది.

**అనకాపల్లి :** ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి సందర్భంగా టిడిపి అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయం వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ తదితరులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కొణతాల వెంకటరావు, కాంద్రేగుల సత్యనారాయణ, మల్ల గణేష్‌పాల్గొన్నారు.

అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో 150 మంది రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. జివిఎంసి 80వ వారు చినరామ కోవెల వద్ద వార్డు అధ్యక్షులు బోడ్డేడ మురళీ బిస్కెట్స్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు.

**యలమంచిలి :** యలమంచిలి మెయిన్‌రోడ్డులోని ప్రధాన కార్యాలయంలో మాజీ పార్లమెంటు సభ్యులు పప్పల చలపతిరావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, కొలకలూరి విజయబాబు పాల్గొన్నారు. సోమలింగపాలెం, కొత్తపాలెం, ఏటికొప్పాక, పులపర్తి, జంపపాలెం, తెరువుపల్లి, కొక్కిరాపల్లి గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి.



బుచ్చయ్యపేటలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజు, తదితరులు

**బుచ్చయ్యపేట :** మండలంలోని రాజాంలో ఎన్టీఆర్ విగ్రహానికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబు పూలమాలలు వేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.ఉరాజు ప్రారంభించారు. బంగారు మెట్ట కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి వడ్డాది టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్, దిబ్బిడిలో మాజీ ఎంపీటీసీ జి.శ్రీనివాసరావు, ఎస్.మణికంఠ నివాళులర్పించారు. నాగులాపల్లి సత్యనారా యణ, మరిశా సతీష్, నరేష్, సాయం శేషు పాల్గొన్నారు.

**సబ్బవరం :** సబ్బవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి పెందుర్తి నియోజకవర్గ ఇంచార్జి గండి బాబ్జి తనయుడు గండి వంశీ దీప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గండి ముత్యాల నాయుడు, బర్నికాన సాయినాథరావు, గండి దేముడు, పిబిబిఎస్ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

**పరవాడ :** మండలంలోని తానాం గ్రామంలో సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్టీ రామారావుకి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పరవాడ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. టిడిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

**కె.కోటపాడు :** మండల కేంద్రం కె.కోటపాడు మూడు రోడ్ల జంక్షన్లో ఎన్టీఆర్ విగ్రహానికి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి నివాళులర్పించారు. అనంతరం టిడిపి రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు ఆధ్వర్యంలో సిహెచ్‌సిలో రోగులకు పళ్ళు రొట్టెలు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రొంగలి మహేష్, డోకల నరసింహమూర్తి, సబ్బవరపు రామానాయుడు, జూరెడ్డి రాము, బండారు నరసింహ నాయుడు, కన్నూరు సూర్యనారాయణ పాల్గొన్నారు.

**కశింకోట :** కశింకోటలోని ఎన్టీఆర్ – బసవతారకం విగ్రహాలకు టిడిపి నియోజకవర్గం ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ పూలమాలలు వేశారు. అనంతరం పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళి, ఉగ్గిన రమణ మూర్తి, వేగి గోపి, సిద్దిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

**దేవరాపల్లి :** మండలంలోని ఎన్. గజపతినగరంలో ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, దేవరాపల్లి మెయిన్ రోడ్డులో ఎన్టీఆర్ చిత్రపటానికి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు నివాళు లర్పించారు. పార్టీ నాయకులు పోతల పాత్రనాయుడు, గ్రామ సర్పంచ్ చిరికి లక్ష్మి, దేవరాపల్లి సర్పంచ్ సబ్బవరం పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

**మునగపాక :** మునగపాక మెయిన్ రోడ్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు పూలమాలలు వేశారు. అనంతరం టిడిపి నేతలు కర్రి సాయికృష్ణ, పెంటకోట విజయ్ సమకూర్చిన దుప్పట్లు, బియ్యం పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

**అచ్యుతాపురం :** అచ్యుతాపురంలో టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు పేద ప్రజలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవానీ, టిడిపి నేతలు రాజాన రమేష్ కుమార్, ధూళి రంగనాయకులు పాల్గొన్నారు. ఎస్ఈజెడ్ దిబ్బపాలెం కాలనీలో మాజీ జడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన నేత బి రాందాసు, తిమ్మరాజుపేట గ్రామంలో సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి బాపు నాయుడు ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించారు.

**పద్మనాభం** : పద్మనాభం మండల కాంప్లెక్స్ సమీప ఎన్‌టిఆర్ పార్కులో ఉన్న ఎన్‌టి.రామారావు విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు కోరాడ రమణ ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కురిమిన లీలావతి, కె.దామోదరరావు, పావని పాల్గొన్నారు.

**మధురవాడ :** జివిఎంసి 5, 6, 7 వార్డుల పరిధిలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. 5వ వార్డు పరిధి పరదేశిపాలెంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి కార్పొరేటర్ మొల్లి హేమలత, మధురవాడ ఆరోగ్య కేంద్రం, చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద విగ్రహాలకు 7వ వార్డు కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మ, పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో ఉన్న విగ్రహానికి 6వ వార్డు టిడిపి అధ్యక్షులు దాసరి శ్రీను పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మొల్లి లక్ష్మణరావు, వాండ్రశి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ పాల్గొన్నారు.

**ఆరిలోవ :** 12వ వార్డుటిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు, ఒమ్మి పోలరావు పాల్గొన్నారు. జివిఎంసి 13వ వార్డు టిడిపి అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు అధ్యక్షతన వార్డు ప్రధాన కార్యదర్శి యల్లమిల్లి సురేష్, మహిళా అధ్యక్షులు మజ్జి రమణి ఆధ్వర్యాన వార్డు పరిధిలోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుమారు 200 మంది పేద వృద్ధ మహిళలకు, వృద్దులకు బియ్యం, చీరలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేఖల కృష్ణగౌడ, నీలి పైడిరాజు, ఓశెట్టి పైడిరాజు పాల్గొన్నారు.



మాడుగులలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు, నేతలు

**భీమునిపట్నం :** భీమిలి మండలం సింగనబందలో ఎన్‌టిఆర్ విగ్రహానికి జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, సర్పంచ్ జివి.నారాయణ తదితరులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. జివిఎంసి ఒకటో వార్డు పరిధి రాజవీధిలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పార్టీ వార్డు అధ్యక్షులు తమ్మిన సూరి బాబు, నాయకులు కొప్పల కృష్ణారావు, చిలకా నరసింగరావుపూలమాలలు వేసి నివాళులర్పించారు. మూడో వార్డు పరిధిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. చిన్న బజారు జంక్షన్‌లో విగ్రహానికి, పార్టీ కార్యాలయంలో చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిహెచ్. రమణ, కె.నాగరాజు, వియ్యపు పోతురాజుపాల్గొన్నారు

**ఆనందపురం :** ఆనందపురం మండలం వేములవలస పాత పంచాయతీ ఆఫీస్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి భీమిలి నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు కోరాడ రాజబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌బి.నాయుడు, తాట్రాజు అప్పారావు, గండ్రెడ్డి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

**గాజువాక :** గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆఫీసులో కార్పొరేటర్లు రక్తదానం చేశారు. 72వ వార్డులో వార్డు ఇన్‌ఛార్జి అక్కిన లక్ష్మణరావు పేదలకు చీరలు పంపిణీ చేశారు.

**పెందుర్తి :** పెందుర్తి జంక్షన్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పార్టీ ఇన్‌ఛార్జి గండి బాబ్జి, 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యాన పూలమాల వేశారు. అనంతరం లయోలా ఓల్డేజ్ హోమ్‌లో పండ్లు, దుప్పట్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో బల్ల శ్రీనివాసరావు, సేనాపతి శంకరరావు, వేగి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**ములగాడ :** జివిఎంసి 61వ వార్డు పరిధి మల్కాపురం బస్టాప్ వద్ద వార్డు పార్టీ అధ్యక్షుడు మజ్జి సోమేష్ ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాకి పోలిరెడ్డి, ఊరుకుటి పైడిరాజు, సర్వసిద్ధి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. 62వ వార్డు పరిధి దుర్గానగర్ సాయిబాబా గుడి వద్ద మజ్జి మాలినాయుడు ఆధ్వర్యాన నిర్వహించిన వర్ధంతిలో ఎమ్మెల్యే చేతుల మీదుగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. డి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. రామకృష్ణాపురం బస్ స్టాప్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి ప్రభుత్వ విప్ గణబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మజ్జి సోమేష్, కాకి పోలిరెడ్డి, నక్క లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. నక్కవానిపాలెంలో నక్క లక్ష్మణరావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ అందజేశారు.

**ఉక్కునగరం :** 87వ వార్డు టిడిపి కార్యాలయంలో, ఎన్‌టిఆర్ పార్కులో ఎన్‌టిఆర్ విగ్రహానికి వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాథం పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీచేశారు. వాలీబాల్ టోర్నమెంట్, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. రాజన్‌రాజు, విజయరామరాజు,కల్లేపల్లి శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.

86వ వార్డు పరిధి కూర్మన్నపాలెం జంక్షన్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ఎత్తున అన్న సమారాధన చేపట్టారు.

## పవన్ కృషితో ఉక్కుకు ప్యాకేజీ

**ప్రజాశక్తి-గొలుగొండ :** జనసేన అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి, పోరాటాలు, విజ్ఞప్తుల ఒత్తిడి స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు భారీ ప్యాకేజీ కేంద్ర ప్రభుత్వం పకటించిందని నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. జనసేన, ప్రజల తరపున ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాద్‌బాబు, డాక్టర్ కోనా నారాయణరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, వాసం వెంకటేష్ పాల్గొన్నారు.

## డిఎస్‌పి మోహనరావు బదిలీ

**ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్** : నర్సీపట్నం డిఎస్‌పి మోహన్‌రావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయనగరం జిల్లా, బొబ్బిలి డిఎస్‌పిగా పనిచేస్తున్న పోతురెడ్డి శ్రీనివాసరావు నర్సీపట్నం డిఎస్‌పిగా బదిలీపై రానున్నారని పోలీస్ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే ఈ బదిలీ ఉత్తర్వులు అమలు కానున్నాయి.

## ఆర్‌టిఐ సాయంతో సమస్యల పరిష్కారం

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్** : సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని ఆర్‌టిఐ ద్వారా సేకరించి, దాని సాయంతో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు ఆర్‌టిఐ ప్రజాస్వామ్య పరిరక్షణ రాష్ట్ర అధ్యక్షులు కె. శివనారాయణరాజు తెలిపారు. తనను రాష్ట్ర అధ్యక్షునిగా నియమించిన సందర్భంగా శనివారం. స్థానిక గెస్ట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పేరు చెప్పుకొని కొంతమంది వ్యక్తులు అవినీతికి పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.అలా కాకుండా ఎక్కడైనా సమస్యలు ఉంటే సమాచార హక్కు చట్టం ద్వారా వాటి వివరాలను రాబట్టి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. సమాచార హక్కు చట్టం దుర్వినియోగం కాకుండా పాటుపడతామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, తదితరులు శివ నారాయణరాజుకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు..

## అంబేద్కర్‌ను అవమానించిన
# అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి




నిరసన వ్యక్తం చేస్తున్న కెవిపిఎస్ నేతలు

**ప్రజాశక్తి-రోలుగుంట** : పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. శనివారం రోలుగుంటలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి, రాజ్యాంగానికి లోబడి పనిచేస్తామని ప్రమాణం ప్రమాణస్వీకారం చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అవమానించడం దారుణమన్నారు. ఇది యావత్ దేశాన్ని అవమానించడమే అవుతుందన్నారు. తక్షణమే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, కేంద్ర మంత్రి పదవి నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు

# సిమెంట్ దిమ్మలు తొలగించాలి

**ప్రజాశక్తి-రోలుగుంట** : మండల కేంద్రంలో డ్రైనేజీకి అడ్డంగా వేసిన సిమెంట్ దిమ్మలను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు, ఇన్‌చార్జ్ ఇఒపిఆర్‌డికి మండల ప్రత్యేకాధికారి మనోహర్ ఆదేశించారు. రోలుగుంట గ్రామానికి చెందిన కొట్టే సంజీవరావు తన ఇంటికి ఆనుకొని ఉన్న డ్రైనేజీకి అడ్డంగా సిమెంట్ దిమ్మలు వేయడంపై అందిన ఫిర్యాదు మేరకు శనివారం మండల ప్రత్యేకాధికారి మనోహర్, ఎంపిడిఒ నాగేశ్వరరావు స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వెంటనే సిమెంట్ దిమ్మలను తొలగించాలని ఆదేశించారు.

# పేదలకు దుప్పట్ల వితరణ



దుప్పట్లు పంపిణీ చేస్తున్నపెదబాబు

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్** : స్థానిక శ్రీరామ ఐరన్ షాప్ యాజమాన్యం శనివారం పేదలకు, యాచకులకు, వికలాంగులకు, కూలీలకు దుప్పట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా దుకాణ యజమాని పెదబాబు మాట్లాడుతూ, చలి నుంచి రక్షణకు తన తల్లిదండ్రుల జ్ఞాపకారం ఏటా సంక్రాంతికి పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. తమకు వచ్చిన ఆదాయంలో కొంత మొత్తాన్ని పేదలకు సేవ చేసేందుకు ఆనవాయితీగా వినియోగిస్తున్నామని, దీంటో ఎంతో సంతృప్తి ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

## డొంకాడలో వైభవంగా వెంకన్న కల్యాణం

**ప్రజాశక్తి-నక్కపల్లి** :మండలంలోని డొంకాడలో వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని, కల్యాణాన్ని తిలకించారు.భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో మేళతాళాలు, కోలాట ప్రదర్శనతో శ్రీదేవి భూదేవి సమేత స్వామి ఉత్సవమూర్తులను ఊరేగించారు. కల్యాణోత్సవం సందర్భంగా తీర్థం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా సమగ్ర భూరీసర్వే

## పలు గ్రామాల్లో అవగాహనా ర్యాలీలు

**ప్రజాశక్తి-కోటవురట్ల** :గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా సమగ్ర భూసర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడతామని తహశీల్దార్ తిరుమలబాబు అన్నారు. శనివారం పైలెట్ ప్రాజెక్టుగా మలివిడత రీసర్వేలో నిర్వహించనున్న చిన్న బొడ్డేపల్లి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రీసర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని, సర్వే సమయంలో ఆధార్‌కార్డు, గతంలో జారీ చేసిన పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, ఫొటోలను గ్రామ రెవిన్యూ అధికారులకు అందజేయాలని సూచించారు. ఈసందర్భంగా రీసర్వేపై అవగాహనకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఊర్ధ్వరావు, మండల సర్వేయర్ శ్రీనివాస్, విఆర్‌ఒల సంఘ నాయకులు రమేష్, పలువురు విఆర్‌ఒలు పాల్గొన్నారు.





నక్కపల్లిలో నిర్వహిస్తున్న రీసర్వే అవగాహనా ర్యాలీ

**నక్కపల్లి** : మండలంలోని గుల్లిపాడులో శనివారం భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రీసర్వే డిటి బాలరాజ్‌దొర, సర్వేయర్ పి.సత్తిబాబు, ఆర్ఐ కన్నబాబు గ్రామ పెద్దలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. భూముల రీసర్వేకు రైతులందరూ సహకరించాలని కోరారు.

**గొలుగొండ** : గొలుగొండ మండలం గుండుపాల గ్రామంలో శనివారం రీ సర్వే గ్రామసభ అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ పీ.శ్రీనివాసరావు మాట్లాడుతూ రీ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. దీర్ఘకాలిక భూసమస్యలు సర్వే ద్వారా పరిష్కారం అవుతాయన్నారు.

**బుచ్చయ్యపేట** : భూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రీ సర్వేను రైతుల సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా భూముల వివరాలను నమోదుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకుని భూముల వివరాలను తమ ఖాతాలో నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఎం లక్ష్మి, ఎంపీడీవో విజయ్ కుమారి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి, మాజీ సర్పంచ్ డొంకిన అప్పలనాయుడు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వైద్యసేవల్లో నిర్లక్ష్యం ఆరోపణలపై విచారణ



ఫిర్యాదీ పాపారావుకు సమాధానపత్రం ఇస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్** : నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సేవల్లో నిర్లక్ష్యం, వైద్యపరీక్షలకు ప్రయివేటుకు రిఫర్ చేయడం వంటి ఆరోపణలపై శనివారం శనివారం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాస్‌నాయుడు, సూపరెంటిండెంట్ డాక్టర్ సుధాశారద విచారణ చేపట్టారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవల్లో నిర్లక్ష్యంపై ఈనెల 5న జిల్లా కలెక్టర్‌కు రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రంశెట్టి పాపారావు ఫిర్యాదు చేయగా, దీనిపై కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేపట్టారు. దీనిపై ఫిర్యాదీ పాపారావుకు సమాధాన పత్రం అందజేశారు.

దాంట్లో రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కొంతమేర ఉందని, వాటన్నిటినీ అరికడతామని పేర్కొన్నారు. ఫిర్యాదులో కోరినట్లు రెండువారాల కోసారి హాస్పిటల్‌ను కలెక్టర్, ఆర్‌డిఒ, డిసిఎస్, స్థానిక ప్రజాప్రతినిధులెవరైనా వచ్చి పర్యవేక్షిస్తారన్నారు. రోగులకు పూర్తిస్థాయిలో నాణ్యమైన వైద్యసేవలుఅందించేందుకు చర్యలు చేపడతామని సమాధాన పత్రంలో పేర్కొనట్లు పాపారావు తెలిపారు కార్యక్రమంలో పరపతి రామ్మోహన్రావు, యూనియన్ నాయకులు కరెడ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

# రేపటి నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

**ప్రజాశక్తి-కోటవురట్ల** : గ్రామాల్లో కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఈనెల 20 నుంచి వచ్చే నెల 2 వరకు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నట్లు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్ తెలిపారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వైద్యసిబ్బందితో నిర్వహించిన సమావేశంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ, వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, తద్వారా అనుమానితులకు పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ జరిగితే ప్రభుత్వపరంగా అందించే వైద్యసేవలపై అవగాహన కల్పిస్తారన్నారు. లెప్రసీ లక్షణాలున్న



మాట్లాడుతున్న డాక్టర్ సంతోష్‌కుమార్

అనుమానితులు నిర్లక్ష్యం, బిడియానికి పోకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు, కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గోవిందరావు పాల్గొన్నారు.



సర్పంచ్‌కు విరాళం ఇస్తున్న దాతలు

# మోదమ్మకు రూ.25 వేలు విరాళం

**ప్రజాశక్తి- మాడుగుల:** మండలంలోని ఎం కోడూరు. మోదకొండమ్మ అమ్మవారికి అదే గ్రామానికి పోతిన చినబాబు, కన్నతల్లి దంపతుల కుమారుడు పోతిన నాగేశ్వరరావు (ఎన్‌ఆర్ఐ) రూ.25 వేలు నగదు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు,పడాల వెంకటరాజు, ముమ్మిన రమణ బాబు, కొప్పు వరాహమూర్తి, కలిమి గోపాల్, గంగిరెడ్ల లింగన్న, గెంజి రాజేష్ కుమార్, జొన్నపిల్లి నాగరాజు పాల్గొన్నారు

# రేపటి నుంచి పశువైద్య శిబిరాలు

**ప్రజాశక్తి -కోటవురట్ల** :పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి నెలాఖరు వరకు కోటవురట్ల, మాకవరపాలెం మండలాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, పాడి రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని నర్సీపట్నం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్ అన్నారు. ఆయా వైద్యశిబిరాల్లో పశువులకు, మేకలు, గొర్రెలకు ఉచితంగా నట్టల నివారణ టీకాలు, గర్భకోశవ్యాధులకు చికిత్సలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగించుకోవాలని కోరారు. పశువైద్యాధికారులు, సిబ్బంది, సచివాలయాల వెటర్నరీ అసిస్టెంట్లతో రెండు బృందాలు ఏర్పాటుచేసామని, ఒక్కో బృందం రోజుకు రెండు గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహిస్తారని వెటర్నరీ ఎడి డాక్టర్ నరేష్ తెలిపారు.

## ఉత్సవ సందడి

**ప్రజాశక్తి - రావికమతం** : మండలంలో చినపాచిల గ్రామంలో శనివారం గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను సర్పంచ్ కోమటి శంకరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ పిండి వంటల సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి, గౌరీ పరమేశ్వరులకు సమర్పించారు. చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ గ్రామాలలో ఇటువంటి ఉత్సవాలు ఏటా ఆనవాయితీగా, సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం శుభ పరిణామన్నారు. తెల్లవారుజాము నుంచి చినపాచిలతోపాటు పరిసర కొమెర, మచ్చపురం, ఎర్రబంద, అగ్రహారం, తదితర గ్రామాల భక్తులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షులు ఆదాడ రాజారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గౌరీ పరమేశ్వరుల నిమజ్జనం

**ప్రజాశక్తి-గొలుగొండ** : మండలంలోని చోద్యం గ్రామంలో గౌరీపరమేశ్వరుల నిమజ్జనాన్ని శనివారం ఘనంగా నిర్వహించారుమహిళలు శిరస్సున సారె పెట్టుకొని ఊరేగించారు.కార్యక్రమంలో సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు దేవాడ శేషు, మాజీ సర్పంచ్ ఆదపురెడ్డి ప్రభాకర్, గ్రామ కమిటీ అధ్యక్షులు అడిగర్ల స్వామినాయుడు, కొరుప్రోలు ధర్మరాజు పాల్గొన్నారు.

## పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎంహెచ్‌ఒ

**ప్రజాశక్తి-గొలుగొండ** : గొలుగొండ, చీడిగుమ్మల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నర్సీపట్నం అదనపు వైద్యాధికారి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో రికార్డులను తనిఖీ చేసి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యాధికారులకు పలు సూచనలు అందజేశారుజ కార్యక్రమంలో గొలుగొండ వైద్యాధికారి డాక్టర్ శ్యామ్ కుమార్, చీడిగుమ్మల వైద్యాధికారి ధనుంజై, సిబ్బంది పాల్గొన్నారు

## రబీ పంటలపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి -రావికమతం:** రబీలో సాగు చేసే పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలని నర్సీపట్నం ఎడిఎ శ్రీదేవి తెలిపారు.శనివారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆత్మ సౌజన్యంతో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ఒకరోజు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ఎడిఎ టి.శ్రీదేవి మాట్లాడుతూ . అపరాల పైర్లను ఆశించే వివిధ చీడపీడలనివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వాణిజ్య పంటల సాగు విధానం, వాటి ప్రయోజనాలను వివరించారు. జిల్లా వనరుల శాఖ ఎఒ విజేత మాట్లాడుతూ కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రంలో వివిధ పంటల విత్తనాలు, నారు మొక్కలు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలన్నారు. ఎన్‌పిఎస్-ఎస్ యాప్ ఉపయోగాలను రైతులకు వివరించారు. ఉద్యానవన శాస్త్రవేత్త ఎన్. సత్తిబాబు, రిసోర్స్ పర్సన్ కిషోర్‌కుమార్, ఎఒ రూప, ఎంపిటిసిలు వేపాడ నాగేశ్వరావు, సూర్యనారాయణ, సర్పంచ్ దాసరి సూర్యకుమారి, రాజారావు పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.